



మానుకోట మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

జాడలేని హెల్త్‌కిట్లు



కేసముద్రం విలేజ్ హైస్కూల్లో బాలికలు

- విద్యార్థినుల ఎదురుచూపులు
- ఐదేళ్ల క్రితం పంపిణీ
- ఏటా నాలుగు విడతలు అందిస్తామని ప్రకటన
- రెండేళ్లపాటు ఇచ్చారు.. తర్వాత మరిచారు
- కొత్త సర్కారుపై బాలికల ఆశలు

కేసముద్రం, జనవరి 24 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద, మధ్య తరగతి విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేందుకు వారి ఆరోగ్యానికి భరోసాను కల్పిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అందించే హెల్త్‌కిట్లు జాడలేకుండా పోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 ఆగస్టులో మొదటి విడత, ఆ తర్వాత ఏడాది వరకు నాలుగు విడతలుగా పంపిణీ చేశారు. ఏటా నాలుగు విడతలుగా హెల్త్‌కిట్లను అందిస్తామని తొలుత అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు విడతలే పంపిణీ చేసి, ఐదేళ్లుగా ఒక్కసారి కూడా హెల్త్‌కిట్లను ఇవ్వలేదు. దీంతో హెల్త్‌కిట్ల కోసం జిల్లాలోని పేద, మధ్య తరగతి వర్గాల బాలికలు ఎంతోఆశగా ఎదురుచూస్తున్నారు.

జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్‌స్కూళ్లు, బాలికల వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో 7 నుంచి 10వ తరగతి వరకు చదివే 12 ఏళ్ల నుంచి 18 ఏళ్ల బాలికలకు హెల్త్ అండ్ హైజీన్ కిట్ల పంపిణీకి 2018 ఆగస్టులో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.1600 విలువ చేసే బ్రాండెడ్ కంపెనీలకు చెందిన 13 రకాల వస్తువులతో కూడిన ఆరోగ్య కిట్లను బాలికలకు 2018, ఆగస్టులో అందజేశారు. ఏడాదిలో ప్రతీ మూడు నెలలకొకసారి చొప్పున నాలుగు విడతలుగా కిట్లను అందిస్తామని అప్పటి ప్రభుత్వం పేర్కొంది. అయితే ప్రభుత్వం అందించాల్సిన హెల్త్‌కిట్లు ఐదేళ్ల అవుతున్నా ఏడాదికి ఒక్కసారి కూడా సరఫరా కాకపోవడంతో బాలికలు నిరాశకు గురవుతున్నారు. అప్పట్లో రెండుసార్లు ఇచ్చిన హెల్త్‌కిట్లలోని వస్తువులన్నీ విద్యార్థినులకు ఎంతో అవసర మైనవి కావడంతో బాగా వినియోగించుకున్నారు.

ప్రస్తుత అవసరాలకు హెల్త్‌కిట్లలోని వస్తువులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థినులు సదరు వస్తువులను కొనుగోలు చేసే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు.



హెల్త్‌కిట్

బాలికల ఆరోగ్యమే లక్ష్యంగా..

రాష్ట్ర ప్రభుత్వం బాలికల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, బాలిక విద్యను బలోపేతం చేస్తూ వారి ఆరోగ్యమే లక్ష్యంగా ఈ హెల్త్‌అండ్‌హైజీన్ కిట్ల పంపిణీని కార్యక్రమాన్ని చేపట్టింది. పాఠశాల స్థాయిలోనే బాలికలకు రుతుస్రావ ప్రక్రియలో పరిశుభ్రత పాటిస్తూ.. వారి అవసరాలకు తగిన విధంగా కిట్‌ను రూపొందించారు. దీనివల్ల వారు భవిష్యత్తులో ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులబారిన పడకుండా జాగ్రతలు పడే అవకాశం ఉంటుంది. ఇందుకోసం 13 రకాల వస్తువులతో కిట్‌ను రూపొందించారు. ఇందులో పతంజలి కంపెనీకి చెందిన మూడు స్నానపు సబ్బులు, మూడు బట్టల సబ్బులు, డాబర్ వాటిక షాంపూ, హేయిర్ ఆయిల్, డాజిలర్ పౌడర్, బబుల్ టూత్‌పేస్ట్‌లు రెండు, టూత్ బ్రష్, టంగ్ క్లీనర్, బొట్టు బిళ్లల ప్యాకెట్ ఒకటి, రిబ్బన్, దువ్వెన, రబ్బర్ బ్యాండ్లు రెండు, విస్పర్ కంపెనీకి చెందిన సానిటరీ నాప్‌కిన్లు ఆరు ప్యాకెట్లు ఇచ్చారు.

జిల్లాలో 10,947 మంది విద్యార్థినులు..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 790 పాఠశాలల్లో హెల్త్‌కిట్లు పొందేందుకు అర్హులుగా 10,947 మంది 7 నుంచి 10వ తరగతి చదివే బాలికలు ఉన్నారు. 2018లో మొదటి విడతలో 16 మండలాల్లో 14,219 మంది బాలికలకు హెల్త్‌కిట్లను అందజేశారు. ఇందులో జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే 8,814 మంది బాలికలు, మోడల్ స్కూళ్లలో 2,674 మంది, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలల్లో 2683మంది, ఎయిడెడ్ పాఠశాలలో 48 మంది వెరసి 14,219 మంది బాలికలకు కిట్లు అందించారు.

మండలాల వారీగా..

మండలాల వారీగా కొత్తగూడ మండలంలో 365 మంది బాలికలకు, గంగారంలో 76, బయ్యారంలో 557, గార్లలో 702, డోర్నకల్‌లో 1,173, కురవిలో 1,313, మహబూబాబాద్‌లో 1,908, గూడూరులో 672, కేసముద్రంలో 1,404, నెల్లికు దురులో 1,310, నర్సింహులపేటలో 658, చిన్నగూడూరులో 251, మరిపెడలో 1,403, దంతాలపల్లిలో 562, తొర్రూరులో 1,377, పెద్దవంగర మండలంలో 488 మంది బాలికలకు అం దించారు. జిల్లాలో 2018, 2019 సంవత్సరాల్లో నాలుగు విడతల్లో 56,283 హెల్త్‌కిట్లను పంపిణీ చేశారు. 2019 నుంచి హెల్త్‌కిట్ల పంపిణీని అప్పటి ప్రభుత్వం ఐదేళ్లపాటు విస్మరిం చింది. తాజాగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి వెంటనే హెల్త్‌కిట్లను అందించాలని బాలికలు కోరుతున్నారు.

మార్కెట్‌కు భారీగా మిర్చి రాబడులు

ఒక్కరోజులోనే క్వింటాకు రూ.393 తగ్గిన ధర

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 24 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం భారీగా మిర్చి రాబడులు కొనసాగాయి. మంగళవారం ఈ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్ల ప్రారంభమైన సంగతి తెలిసిందే. మొదటిరోజు క్వింటాకు రూ.20,925 గరిష్ఠ ధర పలుకగా, బుధవారం రూ.20,532 వరకు గరిష్ఠ ధర పలికింది. ఒక్కరోజులోనే క్వింటాపై రూ.393 రేట్ తగ్గింది. మిర్చిలో తేమశాతం అధికంగా ఉండడంతో మిర్చి ధరల తగ్గుదలకు కారణమని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఈ మార్కెట్‌కు సుమారు 10 వేలబస్తాల వరకు మిర్చి వచ్చింది. అందులో ఈ-నామ్ మార్కెట్ ద్వారా 848 లాట్లు సుమారు 4 వేల బస్తాల వరకు వేలం పాటలు కొనసాగాయి. యార్డులో ఇంకా పాటలు కాకుండా సుమారు 6వేల బస్తాలకు ఆగిపోయాయి. ఈ-నామ్ మార్కెట్‌లో సిబ్బంది అధికంగా లేకపోవడంతో విన్నర్ టెండర్ ప్రైజ్‌లిస్టును రాసేందుకు అధికారులు ఇబ్బందులు పడ్డారు. చివరకు మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్‌తో పాటు ఇతర సిబ్బంది కూడా విన్నర్ లిస్టులో రైతుల పేర్ల నమోదు చేసి, ఇబ్బందులు పడ్డారు. ఈ మార్కెట్‌లో తేజరకం మిర్చి గరిష్ఠంగా రూ.20,532, కనిష్ఠ ధర రూ.8,033, సగటున రూ. 18,500, తాలురకం గరిష్ఠ ధర రూ.11,600 పలుకగా, కనిష్ఠ ధర రూ.8,0 23, సగటున రూ.11,350 ధర పలికింది. కాగా, పత్తి గరిష్ఠ ధర రూ.6,781, కనిష్ఠ రూ.4,555, సగటున రూ.6,781 పలికింది. వేరుశనగ (కొత్తది) క్వింటాకు రూ.6,655 పలుకుతోంది. ఇక ధాన్యం విషయానికొస్తే హెచ్ఎంటీ రకం ధాన్యానికి రూ.2,958, కనిష్ఠ ధర రూ.1,492, జైశ్రీరాం గరిష్ఠ ధర రూ.3,302, కనిష్ఠ ధర రూ.2,465, సాంబమసూరి రూ.2,278, నుంచి రూ.2,155, ఆర్ఎన్ఆర్ రూ.3,016 గరిష్ఠ ధరకాగా కనిష్ఠ రూ.2,000, మినుములు రూ.7,981గా ధర పలికింది.

మార్కెట్‌ను తనిఖీ చేసిన అధికారులు..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మిర్చి రాబడులు ప్రారంభమైన నేపథ్యంలో వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్చియార్డులో తిరిగి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని కార్యదర్శి షంషీర్‌ను ఆదేశించారు. మిర్చి ధరలను వారు అడిగి తెలుసుకున్నారు. అధికారుల వెంట మార్కెట్ సూపర్‌వైజర్ రమేష్ ఉన్నారు.

'ఏనుమాముల'కు పోటెత్తిన ఎర్రబంగారం

- తేజ మిర్చి క్వింటాకు గరిష్ఠ ధర రూ.20,200

వరంగల్ టౌన్, జనవరి 24 : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బుధవారం ఎర్రబంగారం (మిర్చి)తో ఎరుపెక్కింది. సుమారు 40 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో ఇంత పెద్దఎత్తున అమ్మకానికి రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌లో మిర్చిక్వింటాకు గరిష్ఠ ధరలు ఇలా ఉన్నాయి. తేజ రకం మిర్చికి రూ.20,200 గరిష్ఠ ధర పలికింది. అలాగే 341 మిర్చి రకానికి రూ. 16,800, వండర్‌హాట్‌కు రూ.19వేలు, 5,531 రకంమిర్చికి రూ.14వేల ధరలు పలికాయి. కాగా, మంగళవారంతో పోలిస్తే తేజరకం మిర్చికి క్వింటాకు రూ.200 తగ్గింది. అదే విధంగా పత్తికి క్వింటాకు రూ.6,605 పలికింది. మక్కలు రూ.2,440, పచ్చిపల్లి కాయ రూ.5వేలు, సూక పల్లికాయకు రూ.6,810 ధరతో కొనుగోళ్ల జరిగాయి.

'విద్యతోనే విలువలు పెరుగుతాయి'



విద్యార్థినులకు మెమెంటో అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, జనవరి24 : సమాజంలోగౌరవం పొందాలన్నా, వ్యక్తిత్వ వికాసం వికసించాలన్నా అది విద్యతోనే సాధ్యమని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్‌టొప్పొ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ బాలికల దినోత్సవాన్ని' నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాల శాతాన్ని పెంపొందించేందుకు రూపొందించిన జిల్లావ్యాప్త ప్రేరణ పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యనభ్యసించడం ద్వారానే వ్యక్తిత్వం వికసించడంతోపాటు ఉన్నతంగా రాణించగలుగుతారని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న దశలో విద్యార్థులు సాంకేతిక విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, దీనికి క్రమశిక్షణ, పట్టుదల తోడైతే విజయం సాధించవచ్చన్నారు. బాల్యవివాహాలు అంతరించి పోతాయన్నారు. మహిళా విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని గ్రహించాలన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు పరీక్షలో విజయం సాధించాలంటే అనే అంశంపై ప్రేరణ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు రమాదేవి, నర్మద, డాక్టర్ నాగవాణి, శ్రావణి, డాక్టర్ డేవిడ్, వి.ఏలియా, విజయకుమారి, అంబరీష, రామారావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సభ నిర్వహించొద్దు

- ప్రజాసమస్యలకు పరిష్కారం చూపాలి
- వివిధ శాఖల అధికారుల గైర్హాజరు ఆగ్రహం
- ఎమ్మెల్యే మురళీనాయక్ అసహనం



కేసముద్రం మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జనవరి 24 : వివిధ శాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదువుతూ మొక్కుబడిగా మండల సభ నిర్వహించడం సరికాదని, ప్రజాసమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అసహనం వ్యక్తం చేశారు. కేసముద్రం రైతువేదికలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేలం చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖ నుంచి ప్రగతి నివేదికలు చదివారు. పలువురు ప్రజా ప్రతినిధులు సమస్యలను ప్రస్తావించగా మొక్కుబడి సమాధానాలు చెప్పారు. ఎస్ఆర్ఎస్‌పీ నీళ్లను తమ గ్రామానికి సైతం వదలాలని పలువురు సర్పంచులు కోరగా సమాధానం చెప్పేందుకు సంబంధిత అధికారి గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు మండల సభలో అధికారుల నివేదికలు విన్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం ప్రగతినివేదికలు చదివేందుకు ఈ సభ నిర్వహించడం లేదని అన్నారు. ప్రజా సమస్యలపై సరైన పరిష్కారం చూపేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు గైర్హాజరుపట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులు మొదటి తప్పిదంగా వదిలివేస్తున్నానని మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచులను ఎమ్మెల్యే సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, తహసీల్దార్ దామోదర్, ఎంపీడీవో రవీందర్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పదవీకాలం పొడిగించాలని సర్పంచ్‌ల వినతి..

కరోనా సంక్షోభంతో తమ పదవీకాలంలో నిధులు సరిగా రాలేదని, పెండింగ్ బిల్లులు ఉన్నాయని ఈ క్రమంలో పదవీకాలాన్ని పొడిగించాలని కేసముద్రం మండల సర్పంచులు ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తాము ఎన్నికైన ఎనిమిది నెలల తర్వాత చెక్‌పవర్ వచ్చిందని, ఆ తర్వాత కరోనా రావడంతో నిధులు నిలిచిపోయాయని తెలిపారు. 25నెలలుగా ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదని తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలి

విధులకు సక్రమంగా హాజరుకాకుండా పాఠశాల నిర్వహణపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగాఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ ఉదయం వచ్చి హాజరు వేసుకొని మీటింగ్ ఉందనే పేరుతో తరచూ వెళ్లిపోతున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. ఆయనపై విచారణ జరిపి వెంటనే బదిలీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

పాలకుర్తికి అరుదైన గౌరవం

- తెలంగాణ శకటంలో వీరనారి ఐలమ్మ విగ్రహం
- హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు



తెలంగాణ శకటంపై వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం

పాలకుర్తి, జనవరి 24 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నడుంబిగించి విస్నూరు దేశ్‌ముఖ్‌పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మకు అరుదైన గౌరవం దక్కింది. న్యూ ఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో తెలంగాణా శకటం ప్రదర్శనకు చోటు దక్కగా, దానిలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహంతో శకటం ప్రదర్శించనున్నారు. 2015, 2020 సంవత్సరాల అనంతరం ఈ సంవత్సరమే తెలంగాణా శకటానికి అవకాశం దక్కగా ఈ ఏడాదితో పాటు వచ్చే మరో రెండేళ్ల పాటు కూడా ఐలమ్మ విగ్రహంతో కూడిన తెలంగాణ శకటం ప్రదర్శనకు అనుమతి లభించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణలో పాఠశాల విద్యలో ఐలమ్మ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చారు. భావితరాలకు ఐలమ్మ చరిత్ర తెలిసేలా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర శకటంలో వీరనారి ప్రతిమను ఉంచడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ స్థాయిలో కాజీపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి

- రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం..
- దక్షిణ మధ్య రైల్వే జీఎం అనిల్‌కుమార్ జైన్
- రైల్వే పాలిక్లినిక్ అప్‌గ్రేడెడ్ ఆస్పత్రికి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రైల్వే జీఎం అనిల్‌కుమార్ జైన్

కాజీపేట, జనవరి 24 : కాజీపేట రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్టు స్థాయిలో అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ జైన్ తెలిపారు. కాజీపేటలో బుధవారం రైల్వే పాలీక్లినిక్ అప్‌గ్రేడెడ్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాజీపేట రైల్వే ఆస్పత్రిలో ఐదు వేలమంది రైల్వే కార్మికులు, ఐదువేల మంది రిటైర్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలతో సహా సుమారు 20వేల మంది వైద్యసేవలు వినియోగించుకుంటున్నారన్నారు. అందుకోసం పాతభవనంతో పాటు నూతనంగా నిర్మించిన అప్‌గ్రేడ్ ఆస్పత్రి భవనం ప్రారంభించామన్నారు. ఈ ఆస్పత్రిలో మహిళలకు, పురుషులకు ప్రత్యేక వార్డులతో పాటు ఇతర అధునాతన మెడికల్ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా రైల్వే రిటైర్డ్ ఉద్యోగులకు కంటికి సంబంధించిన సమస్యలు రావడంతో ప్రత్యేక కంటి వైద్యులను ఏర్పాటు చేస్తామని, అప్పటివరకు మరో ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్‌చేసే విషయం చర్చిస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధికి గతంలో కేటాయించిన ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించామని జీఎం పేర్కొన్నారు. మరో రూ.20 కోట్లు నిధులు కేటాయించి ప్రత్యేక బుకింగ్ కౌంటర్లు, ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి తదితర పనులు చేపడుతున్నామన్నారు. కాజీపేట, కాజీపేట టౌన్‌స్టేషన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామన్నారు. అనంతరం ఫిట్‌లైన్‌లను,లోకోషైలెట్‌ల కార్యాలయాలను తనిఖీలు చేసి అధికారులకుసూచనలు చేశారు. జీఎం వెంట డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, సీఎంఎస్ అనురాధ రెడ్డి, సీనియర్ డీఎం టీఆర్‌డీ వాసిమ్‌పాష, డీవో ఎం సురేశ్‌రెడ్డితో పాటు అన్ని వింగ్‌ల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి..

రైల్వే కార్మికులకు ప్రత్యేక కంటి వైద్యుడిని ఏర్పాటు చేయాలని, సబ్‌డివిజన్ స్థాయిలో ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ సౌకర్యం కల్పించాలని, రైల్వే జీఎంను కలిసి కార్మిక నాయకులు విన్నవించారు. జీఎంను కలిసిన వారిలో మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, తెలంగాణ రైల్వే ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, నాయకులు సదానందం, సీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస యాదవ్, జానీ,అక్బర్ ఉన్నారు. కాగా, జీఎం కాజీపేట పర్యటన సమాచారాన్నిస్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి ప్రొటోకాల్ అధికారులు సమాచారం ఇవ్వకపోవడం సరికాదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎమ్డీ అంకూస్ విమర్శించారు.

రూ.40 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- వాహనం బోల్తా పడడంతో వెలుగులోకి వచ్చిన అక్రమ రవాణా
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు



గంజాయి చాక్లెట్‌ల వివరాలను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తొర్రూరు, జనవరి 24 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు తొర్రూరులోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వెల్లడించిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ తన సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం మానుకోట పట్టణ శివారు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీలు చేస్తుంన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ షిఫ్ట్ డిజైర్ కారు అధికారులు ఆపినా, వెళ్లడంతో దానిని వెంబడించారు. వేగంగా వెళ్తున్న కారు నెల్లికుదురు మండలం లక్ష్మీపురం మెయిన్ రోడ్‌పై బోల్తాపడింది. ఎక్సైజ్ అధికారులు ఆ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో ఉన్న 2 కేజీల ప్యాకెట్స్‌తో గల 100 గంజాయి ప్యాకెట్లను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రంపచోడవరం నుంచి కారులో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు తమకు తెలిసిందని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు వివరించారు. నంద్యాల జిల్లా సిద్ధాపురం గ్రామానికి చెందిన కె.జయచంద్రుడు రంపచోడవరం నుంచి గంజాయితో ఉన్న వాహనాన్ని తొర్రూరు వరకు తరలించాలని, అక్కడి నుంచి మరొకరు ఆ వాహనాన్ని తీసుకెళ్తారని ట్రాన్స్‌పోర్టు ఒప్పందం కుదుర్చుకుని వస్తుండగా.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో గంజాయి పట్టుబడిందని తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.40 లక్షలు ఉంటుందని, జయచంద్రుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని.. ప్రభుత్వం మాదకద్రవ్యాల రవాణాను, విక్రయాలను అరికట్టేందుకు గట్టి చర్యలు చేపడుతోందన్నారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి గంజాయిని చాక్లెట్‌ల రూపంలో తయారు చేసి.. తెలంగాణలో విక్రయాలు చేపడుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తంగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమీప దుకాణాలపై ఎలాంటి అనుమానాలు తలెత్తినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రెండు రోజుల క్రితం మహబూబాబాద్‌లోని రైల్వేస్టేషన్‌లో తరలిస్తున్న గంజాయి చాక్లెట్లలను కూడా స్వాధీనం చేసుకోవడం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై హరీష్, ఎక్సైజ్ ఎస్సై రవళి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు..

రెడ్యాల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి



పండు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 24 : ఢిల్లీలో ఈనెల 26వ తేదీన జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు మహబూబాబాద్ జిల్లా రెడ్యాల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి జె.పండు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటరెడ్డి, గిరిజన క్రీడల అధికారి డి.మోహన్‌నాయక్ బుధవారం తెలిపారు. పాఠశాలలో ఎస్సెస్సీ విద్యనభ్యసిస్తున్న పండు జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో మూడుసార్లు పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ వేడుకలో పాల్గొనేందుకు అవకాశం వచ్చినట్లు వివరించారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా ఆ విద్యార్థిని ఢిల్లీకి పంపినట్లు చెప్పారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలో పాల్గొనే అవకాశం పండుకు రావడం పట్ల ఐటీడీఏ పీవో అంకిత్, డీడీ ఎర్రయ్య, ఏటీడీవో సత్యవతి హర్షం వ్యక్తం చేశారు.

జోరుగా ముందస్తు మొక్కులు


మేడారంలో భక్తుల రద్దీ



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 24 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కోలాహలంగా మారింది. వనదేవతలు సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్షల మందికి పైగా తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులు వనదేవతలను ముందస్తుగా దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. సమ్మక్క, సారలమ్మల నామాలను స్మరించుకుంటూ గద్దెలకు చేరుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ కొబ్బరికాయలు బంగారం (బెల్లం), చీరెలు, సారెలు

మిగతా 8వ పేజీలో








విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ పరీక్ష తేదీలు ఖరారు

నయీంనగర్, జనవరి 24: టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధి ఉమ్మడి వరంగల్ ఆపరేషన్ సర్కిల్‌లో జూనియర్ లైన్‌మెన్ నియామకం నోటిఫికేషన్ 2018వ సంవత్సరం జనవరి నెలలో విడుదలైంది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు 2024 ఫిబ్రవరి 1, 2వ తేదీలలో జూనియర్ లైన్‌మెన్ అర్హులైన అభ్యర్థులకు విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్ష, విద్య అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9గంటలకు ములుగురోడ్‌లోని నార్త్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)కి విధిగా హాజరుకాగలరని టీఎస్ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కే. వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



వ్యక్తిని బెదిరించి గొలుసు, సెల్ అపహరణ

నయీంనగర్, జనవరి 24: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రానికి చెందిన డేగల అంజనేయ ప్రసాద్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి అతడి నుంచి బంగారు గొలుసు, మొబైల్‌ను సోమవారం సాయంత్రం అపహరించారు. సుబేదారి సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన డేగల అంజనేయ ప్రసాద్(55) అనే వ్యక్తి హనుమకొండ కిషన్‌పురలోని గీతాంజలి డిగ్రీ కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తాడు. ఈ క్రమంలో అంజనేయప్రసాద్ తన పని మీద ఖమ్మం వెళ్లి తిరిగి సోమవారం సాయంత్రం సుమారు 4గంటల ప్రాంతంలో హనుమకొండ బస్టాండ్‌కు వచ్చాడు. బాధితుడు తన ఇంటికి వెళ్లాలని ఆటోకోసం చూస్తుండగా ఆటో దొరకకపోవడంతో నడుచుకుంటూ ఏషియన్‌మాల్ మీదుగా వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో బెదిరించి తన మెడలో ఉన్న రూ.60,000 విలువ గల బంగారు గొలుసు, రూ.12,000 విలువ గల రెడ్‌మీ సెల్‌ను అపహరించినట్లు సీఐ తెలిపారు. బాధితుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ షూకూర్ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రతిభాపాటవ పరీక్ష

హనుమకొండ రూరల్, జనవరి 24: తెలంగాణ విద్యాశాఖ, సాంఘిక శాస్త్రఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సాంఘికశాస్త్రంలో ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 30వ తేదీలోపు పరీక్ష నిర్వహించి ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థుల వివరాలను పరీక్ష నిర్వాహకులు సోషల్‌ఫోరం బాధ్యులకు అందజేయాలన్నారు. ఈ పోటీలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషులో, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్ మధ్యమంలో మాత్రమే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షనిర్వహణకు సంబంధించి వివరాల కోసం జిల్లా సోషల్ ఫోరం బాధ్యులు అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి 98498 34110, సతీష్ ప్రకాష్ 97001 04075 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.















'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నా యి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మా ణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుం డా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్య
- కాంగ్రెస్‌కు ఓటేసినవారు బాధపడుతున్నారు
- ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిలింది చిన్న దెబ్బే
- తప్పుడు హామీలతో ప్రజల్ని నమ్మించిన రేవంత్ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో.. ఓటుతో కొడతారో రైతులు ఆలోచించాలి
- ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకం: కేటీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కరీంనగర్ టౌన్, జనవరి 24: తొందర్లోనే కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు కూడా అనుకోలేదని, అందుకే బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీగా ఇస్తామంటూ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన వారంతా ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్నదెబ్బ మాత్రమే తగిలిందన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతోనే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ అన్నారు. ప్రజల తీర్పును అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధాన మంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో్‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్ల అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి


విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్టుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

అవినీతికి పాల్పడితే సహించేదిలేదు

• ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్


మాట్లాడుతున్న జాటోత్ రాంచంద్రునాయక్

మరిపెడ, జనవరి 24 : అవినీతికి పాల్పడితే సహించేదిలేదని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ హెచ్చరించారు. బుధవారం మరిపెడ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం మునిసిపల్ ఛైర్‌పర్సన్ గుగులోత్ సింధూరకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలకు, ఇంటి నంబర్లకు, మ్యూటేషన్ల కోసం కమిషనర్ మునిసిపల్ ఆఫీస్‌లో పని చేస్తున్న ఇద్దరిని మధ్యవర్తులుగా చేసుకొని డబ్బులు వసూలు చేస్తున్నారని ఉప్పల నాగేశ్వర్‌రావు, ఎడెల్లి పరుశరాములు, బయ్య భిక్షం, పూరుకొండ శ్రీనివాస్, మక్సూద్ ఆరోపించారు. రాంవిలాస్ గల్లీ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని అధికారుల నిర్లక్ష్యంతోనే ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 465 సర్వే నంబర్లోని ఇళ్ల నిర్మాణాలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని కౌన్సిలర్లు కోరారు. అర్హులైన వారికి ఇంటి నంబర్లు ఇవ్వాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. మరిపెడ మునిసిపల్ అభివృద్ధిపై నజర్ పెట్టాలన్నారు.

మీడియా ప్రవేశంతో మునిసిపల్ అధికారుల గుట్టురట్టువుతుందనో.. లేక ఇంకేమైందో కానీ కౌన్సిల్ సమావేశానికి మీడియాను అనుమతించ లేదు. కొందరు మీడియా ప్రతినిధులు కమిషనర్‌ను ప్రశ్నించడంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకోగా ఈ ఒక్కసారికి అవకాశం ఇస్తున్నాను, ఇదే ఫస్ట్ ఇదే లాస్ట్‌గా గుర్తించాలని కమిషనర్ అయిష్టంగా అనుమతించారు. వైస్ ఛైర్మన్ బుచ్చిరెడ్డి, తహసీల్దార్ సైదులు, కమిషనర్ రాజు, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మునిసిపాలిటీకి చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

40 మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక..

● చిన్నగూడూరు : డోర్నకల్ నియోజకవర్గంలో రెడ్యానాయక్ శకం ముగిసిందని, వచ్చే ఇరవై ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందనిఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. చిన్నగూడూరులోని రాంరెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ స్వగ్రామం ఉగ్గంపల్లి నుంచి 40 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు క్రిష్ణారెడ్డి, నాగేష్, జీవన్, రాంకోటి, మెగ్యా, యాకన్న, వీరాచారి, జగన్, శ్రీపాల్, లక్‌పతి, వెంకన్న, రాజు అజయ్, శ్రావణ్ ఉన్నారు.

చెక్‌డ్యాం పునర్ నిర్మాణానికి కృషి

●నర్సింహులపేట : ముంగిమడుగు చెక్‌డ్యాం పునర్‌నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యేరాంచందర్‌నాయక్ అన్నారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి చెక్‌డ్యాం పరిసరాలను ఆయన సందర్శించి పరిశీలించారు. వరద ఉధృతి, చెక్‌డ్యాం ధ్వంసంపై వాగు పరివాహక రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద ఉధృతికి ధ్వంసమైన చెక్‌డ్యాం పునర్ నిర్మాణానికి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుతో పాటు నియోజకవర్గ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇరిగేషన్ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

ఎన్ఆర్ఐ తల్లిదండ్రులకు బాసటగా నిలుస్తాం

● ఎన్ఆర్ఐ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజివర్ధన్ రెడ్డి


మానుకోటలో ఎన్ఆర్ఐ రెడ్డి పేరేంట్స్ అసోసియేషన్ జిల్లా అడ్‌హాక్ కమిటీతో రాష్ట్ర అధ్యక్షుడు అంజివర్ధన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 24 : అనేక ఒడిదొడుకులు, కష్టాలు పడి విదేశాల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లిన పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి బాసటగా నిలుస్తామని ఎన్ఆర్ఐ (ప్రవాస) రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజివర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో ఎన్ఆర్ఐ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ప్రథమ సమావేశం పర్కాల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇక్కడ అమలవుతున్న రిజర్వేషన్ల మూలంగా తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు దొరకని నేపథ్యంలో రెడ్డివర్గానికి చెందిన తల్లిదండ్రులు ఎన్నోవ్యయ ప్రయాసాలకోర్చి అప్పులు చేసి విదేశాల్లో చదువుల కోసం తమ పిల్లలను పంపతున్నారని చెప్పారు. అక్కడ కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు అందుబాటులో లేక ఇక్కడ ఒంటరిగా గడుపుతున్న తల్లిదండ్రులకు అసోసియేషన్ బాసటగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా అడ్‌హాక్ కమిటీని ప్రకటించారు. గౌరవ సలహాదారుడిగా పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్‌గా పర్కాల రవీందర్‌రెడ్డి, కోకన్వీనర్లుగా డాక్టర్ పాల్వాయి సౌజన్య, నాయిని ఉమాదేవి, వల్లూరి కృష్ణారెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి సతీష్‌రెడ్డి, దేవుడి మధూసూదన్‌రెడ్డిను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఛైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, గౌరవ సలహదారులు మర్రి యాదవరెడ్డి, వెంకటరంగారెడ్డి, పింగిలి వీరారెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, కేశవరెడ్డి, ఉషారెడ్డి, పద్మారెడ్డి, పర్కాల హేమలత, యాళ్ల పుష్పలత, సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల్లో ఆరుగురిపై కేసు

● సీఐ ఉపేందర్‌రావు

డోర్నకల్, జనవరి 24 : వరకట్న వేధింపులకు పాల్పడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం చాంప్లాతండాకు చెందిన గుగులోతు అనితకు డోర్నకల్ మండలం తెల్లబండ తండాకు చెందిన నరేష్‌తో 2021 జూన్‌లో వివాహం జరిపించారు.వివాహ సమయంలో రూ.4 లక్షల కట్నం, 15 తులాల బంగారం, రూ.5 లక్షల విలువైన ఇంటి సామగ్రిని అనిత తల్లిదండ్రులు అందించారు. పది నెలల వారికి పాప పుట్టింది. ఆ తర్వాత నుంచి అనిత భర్త నరేష్, అత్త కాంతి, అడపడుచులు జర్పుల విజయ, జాటోతు సత్య చిట్టి, అడపడుచు భర్త చరణ్‌లు తనను అదనపు కట్నం రూ.20 లక్షలు తీసుకురావాలని వేధిస్తున్నట్లు సీఐ తెలిపారు. బాధితురాలు అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

డోర్నకల్, జనవరి 24 : మండలంలో ఓ వ్యక్తిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న మైనర్‌ను అదే గ్రామానికి చెందిన మధు అనేవ్యక్తి ప్రేమించాలంటూ వేధిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బాలికను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని పక్కనే ఉన్న ఓ గ్రామానికి వెళ్తుండగా, గమనించిన బాలిక బంధువులు అతడిని పట్టుకుని నిలదీశారు. ఈ విషయంపై బాలిక తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై ఝాన్సీ మధుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మైనర్లను వేధిస్తే చట్టపరంగా శిక్షిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

డోర్నకల్‌లో ఆటో చోరీ

డోర్నకల్, జనవరి 24 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో ఓ ఇంటిముందు పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైనట్లు ఎస్సై సంతోష్‌రావు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని సుభాష్ వీధికి చెందిన ఇల్లటూరి వీరస్వామి అనేవ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీన రాత్రి సమయంలో తన ఇంటిముందు పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున లేచిచూసే సరికి ఆటో లేకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలను గాలించారు. అయినా ఆటో ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మతిస్థిమితం లేని యువకుడు ఆత్మహత్య

కేసముద్రం, జనవరి 24 : కేసముద్రం మండలం కాట్రపల్లిలో బుధవారం ఉదయం మతిస్థిమితం సరిగాలేని తూళ్ల ప్రశాంత్(22) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. అవివాహితుడైన ప్రశాంత్ మతిస్థిమితం సరిగా లేదని ఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో ఉదయం బావిలో దూకగా గ్రామస్తులు చూసి ప్రశాంత్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుని తండ్రి యాకాంబ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలు ఆదరిస్తే, ఖాకీ చొక్కా వదిలి..

ఖద్దర్ చొక్కా తొడుగుతా

• హైదరాబాద్ డీజీ ఆఫీస్ ఎస్పీ నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న దుంగ్రోత్ నాగరాజు

మహబూబాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మానుకోట ప్రజలు విజ్ఞానవంతులని వారు ఆదరిస్తే.. ఖాకీచొక్కా వదిలి.. ఖద్దరు చొక్కతొడిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేస్తానని హైదరాబాద్ డీజీ ఆఫీస్ ఎస్పీ దుంగ్రోత్ నాగరాజు అన్నారు. జిల్లాలో బుధవారంఆయన పర్యటించారు. కురవిలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురవి నుంచి మానుకోట దైవకృప అనాథశ్రమం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రజలతో తనకు సత్సంబంధాలున్నాయని గత ఏనిమిదేళ్ల క్రితం ఇక్కడ డీఎస్పీగా పని చేసిన అనుభవం తనకుందన్నారు. సామాజిక సేవాదృక్పథంతో గుడుంబా రహిత మానుకోట లక్ష్యంగా పని చేశానని తెలిపారు. ఇక్కడి ప్రజలు తనను అర్థం చేసుకుని అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించారని, వారి సహాయాన్ని ఎప్పటికి మరువలేనని చెప్పారు. తాను 35 సంవత్సరాలు పోలీస్ వృత్తిలో పని చేసినప్పటికి తనకు నచ్చిన ప్రాంతం మానుకోట అని స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజల కోసం ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఇప్పటికే తన పదవికి వీఆర్ ఎస్ పెట్టుకున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా టిక్కెట్ ఇచ్చి అవకాశం కల్పిస్తే బరిలో నిలు స్తానని స్పష్టం చేశారు. నాగరాజు యువసేన బాధ్యులు చల్లా వేణు, శివ, శంతన్‌రామారాజు పాల్గొన్నారు.

రెండోరోజు సీపీఐ నిరసనలు

మహబూబాబాద్ టౌన్, జనవరి24 : మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ రూ.52 కోట్ల నిధులకు సంబంధించి జీవోలిచ్చి నిధులు మంజూరు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ మానుకోటలో సీపీఐ ఆధ్వర్యంలో రెండోరోజు బుధవారం నాలుగు బృందాలు, 14 వార్డుల్లో ఆందోళనలు చేపట్టాయి. ఈ సందర్భంగా కౌన్సిలర్ బి.నీరజాధర్మన్న, పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కేసీఆర్ మానుకోట పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు, కేటీఆర్ రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి జీవోలను ఇచ్చి నిధులను మంజూరి చేయలేదని విమర్శించారు. మోసం చేసిన వారిని జైలుకు పంపాలన్నారు. నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, రవి, శ్రావణ్, వీరన్న, ఫాతిమా, చిరంజీవి, ప్రవీణ్, శంకర్, అశోక్, పద్మ, భాగ్యమ్మ, నాగార్జున, జ్ఞానేశ్వర్, సత్యం, మహేష్, శ్రీకాంత్, ఐలయ్య, రమేష్, పాల్ పాల్గొన్నారు.

మానుకోట పార్లమెంట్ స్థానం

నాకు ఇప్పించండి

●ఎన్పీడీసీఎల్ డీఈ ఎట్టి వెంకన్న

గూడూరు, జనవరి 24 : మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం టికెట్‌ను తనకు ఇప్పించాలని సంగారెడ్డి జిల్లా తండూరు ఎన్పీడీసీఎల్ డీఈ ఎట్టి వెంకన్న కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిను వేర్వేరుగా కలిసి బోకే అందించి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ తనపేరు పరిశీలనలో ఉందని, ఆదివాసీ సంఘాల మద్దతు కూడా తనకే ఉందని స్పష్టం చేశారు. గత 15ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఇతర సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇచ్చిందని, ఈసారి ఆదివాసీనైన తనకు కేటాయించే విధంగా తోడ్పాటునందించాలని కోరారు. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు వెంకన్న స్పష్టం చేశారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

వరంగల్ టౌన్, జనవరి 24 : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం, 27న వారాంతపు యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందన్నారు. మార్కెట్‌లో సోమవారం నుంచి యథావిధిగా సరుకుల క్రయవిక్రయాలు జరుగుతాయని కార్యదర్శి సంగయ్య పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు, కార్మికులు, వ్యాపారులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

గణతంత్ర వేడుకలకు నర్సింహులగూడెం ఉపాధ్యాయుడు


కొడిపాక రమేష్

కేసముద్రం, జనవరి 24 : న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు కేసముద్రం మండలం పెనుగొండ శివారు నర్సింహులగూడెం పాఠశాల హెచ్ఎం కొడిపాక రమేష్‌కు బుధవారం ఆహ్వానం అందింది. గతంలో 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో రమేష్ తల్లి అరుణ తన కుటుంబాన్ని పోషించి పిల్లలను విద్యావంతులను చేయడాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా గణతంత్ర ఉత్సవాలకు రావాలని ప్రసారభారతి విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ నుంచి ఆహ్వాన లేఖను అందుకున్నట్లు రమేష్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలి

● జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 24 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ ఫాతిమా హైస్కూల్‌లో బుధవారం తెలంగాణ నేషనల్‌గ్రీన్‌కోర్, విద్యాశాఖసంయుక్తంగా నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ-సుస్థిర జీవనశైలి అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్‌స్కూల్ మొదలగు యాజమాన్య పాఠశాలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రామారావుమాట్లాడుతూ...జీవనవైవిధ్యం ఆవశ్యకతను అర్థం చేసుకుంటూ పాఠశాలల ఎకోక్లబ్‌ల ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ విస్తృప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వి. గురునాథరావు, డీఎస్వో అప్పారావు, ఏఎంవో చంద్రశేఖర్ ఆజాద్, ఫాతిమా, ఆరోగ్యమేరీ, రిసోర్స్ పర్సన్‌లు శికిరణ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జోరుగా ముందస్తు మొక్కులు

(5వ పేజీ తరువాయి)

సమర్పించుకున్నారు. కోరికలు తీరాలని తల్లులను వేడుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో వసతి గృహాల్లో, చెట్ల కింద విడిది చేసి వంటలు చేసుకున్నారు. బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేసి రోజంతా గడిపారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు.

దర్శించుకున్న ఎన్నికల సంఘం కమిషనర్

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గద్దెలకు చేరుకున్న కమిషనర్ వనదేవతలకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించారు. పూజారుల నుంచి అమ్మవార్ల ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పూజారులు కండువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటు హక్కుపై అవగాహన

గూడూరు, జనవరి 24 : మండలంలో గురువారం నుంచి ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో ముగ్గుల పోటీలను నిర్వహించాలన్నారు. సీనియర్ ఓటర్లతో పాటు 18 ఏళ్ల నిండిన కొత్త ఓటర్లను సన్మానించాలన్నారు. సమావేశంలో నయాబ్ తహసీల్దార్ కోమల, ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కేసముద్రం, జనవరి 24 : కేసముద్రంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు తంగళ్లపల్లి భాస్కర్-కవిత దంపతుల పెళ్లిరోజు సందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. తంగళ్లపల్లి నందయ్య, చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.చంద్రశేఖర్, బోగోజు నాగేశ్వరాచారి, యర్నం శ్రీరాములు, చింతా కరుణాకర్, లక్కాకుల సత్యనారాయణ, మారం సమ్మిరెడ్డి, రాపాక కుమారస్వామి, మదిపెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

వద్దిరాజు రవిచంద్రను కలిసిన మున్నూరుకాపు సంఘం నాయకులు


రవిచంద్రను సన్మానిస్తున్న నాయకులు

కేసముద్రం, జనవరి 24 : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు సందర్భంగా ఖమ్మంలో బుధవారం ఆయన్ను కేసముద్రం మున్నూరుకాపు సంఘం నాయకులు కలిసి సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి, కముటం స్వామి, ఆకుల సుధాకర్, పాల శ్రీనివాస్, నూకల వెంకటేశ్వర్లు, ఆరుద్రపు శ్రీనివాస్, పిన్ని రాము, గుండు దామోదర్, పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక శాఖలో.. నమోదైన పిల్లలకు ఉచితంగా కెరీర్ గైడెన్స్

మహబూబాబాద్ టౌన్, జనవరి 24 : మహబూబాబాద్ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖలో నమోదైన కార్మికుల పిల్లలకు ఉచితంగా కేరీర్‌గైడెన్స్ అందించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్మికశాఖ ఆధ్వర్యంలో బుధవారం రెస్యూమ్ ప్రిపరేషన్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి రమేష్ మాట్లాడారు. యువతలో నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం ఏపీ అండ్ తెలంగాణ ప్రొడక్టివిటీ కౌన్సిల్, తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో 41 రకాల కంప్యూటర్స్ కోర్సులను యాప్‌ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ కార్మికశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉపాధిఅవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 180 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ప్రకాశ్, దాసరి రాజేంద్ర, మండవ వంశీకృష్ణ పాల్గొన్నారు.

బీఎస్పీ గెలుపునకు కృషి చేయాలి

నెహ్రూసెంటర్, జనవరి 24 : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి కందికంటి విజయ్‌కుమార్ అన్నారు. మానుకోటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. దార్ల శివరాజ్, విజయ్‌కాంత్, శివకుమార్, రఘు, మధు, తగరం నాగన్న, ఎడ్ల శ్రీను, ఐతం ఉపేందర్, గుగులోతు నరేష్, జింక లక్ష్మణ్, తప్పెట్ల చాణక్య, తోకల నాగరాజు, బాదావత్ ప్రతాప్, అజ్మీర వెంకన్న, స్వప్న పాల్గొన్నారు.

దండోరా సదస్సును జయప్రదం చేయాలి

నెహ్రూసెంటర్, జనవరి 24 : హైదరాబాద్‌లో ఈనెల 29న జరిగే దండోరా రాష్ట్రసదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం, కేటీఆర్ కాలనీల్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పులి శ్రీను, సందీప్, సాంబయ్య, సమ్మయ్య, దిట్టబోయిన శ్రీను, సీహెచ్.రాధ, కుక్కల సుధ, ప్రమీల, సంధ్య పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 24 : డ్రైవర్ల అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ ఉంటుందని ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డ్రైవర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాల వాహనాలు నడిపే డ్రైవర్లుఉప్పలయ్య, సురేష్, వెంకన్న, వెంకటేశ్‌లను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రీతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

తొర్రూరు, జనవరి 24 : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బుధవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యురాలు జ్వలిత, ఎస్సై జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలు సామాజిక అవగాహన పెంచుకోవాలని, విద్య ఆరోగ్యం, ఇతర రంగాల్లో చురుకుగా ఉండాలన్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆడపిల్లలకు అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు, జాతీయ బాలిక అభివృద్ధి మిషన్‌ను కూడా చేపట్టిందని వారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పోషకాహారం, వివాహం, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ ఏటా జనవరి 24న బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు నందన, ప్రియాంక, నిరంజని, మీరజ్, ప్రిన్సిపాల్ శైలజ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో..


మాట్లాడుతున్న జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయవాది మౌనిక

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్‌లో బుధవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలపై జరుగుతున్న వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయవాది మౌనిక మాట్లాడారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే లైంగిక వేధింపుల్లో బాధితులకు వైద్యపరమైన, మానసిక, న్యాయపరమైన సహాయంపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలపై జరిగే లైంగిక వేధింపుల నేరాల్లో నేరం రుజువై శిక్షలు పడిన తర్వాత బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అందించే నష్టపరిహారం పొందడంలో సహకరిస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. భరోసా న్యాయ సహాయ న్యాయవాది సాహితీ, భరోసా సెంటర్ నిర్వాహకులు జయశ్రీ, సఖి న్యాయవాది ఉష, పీటీమ్ ఏఎస్సై రాజేశ్వరి పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెద్దవంగర, జనవరి 24 : టీఎస్‌యూటీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) మండలకమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి, మండల ఎన్నికల పరిశీలకుడు ఎర్ర వెంకన్న తెలిపారు. మండల అధ్యక్షుడిగా గుర్రం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా రాయలు, గంగారపు స్రవంతి, కోశాధికారిగా విజయ్‌కుమార్, కార్యదర్శులుగా సదయ్య, సైదమ్మ, మాధవి, జిల్లా డెలిగేట్స్ జనార్ధన్, రవికుమార్, ఎఫ్ఎంఎఫ్ కన్వీనర్‌గా ధర్మరపు రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో అన్నప్రాసన

మరిపెడ రూరల్, జనవరి 24 : మండంలోని ఎడ్జర్ల అంగన్‌వాడీ సెంటర్‌లో బాలికల దినోత్సవ సందర్భంగా బుధవారం చిన్నారులకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలలు నిండిన పాపలకు అన్నిరకాల పప్పుదినుసులను కలిపి మెత్తగా వండిన తర్వాత తినిపించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ పి.సుధ, ఆయా ఉపేంద్ర, ఏఎన్ఎం ఆర్.పద్మ ఆశావర్కర్ జి.రమ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలి

కురవి, జనవరి 24 : ఎస్సీ బాలికల వసతి గృహానికి సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంధసిరి జ్యోతిబసు, వీరేందర్, మురళి, గణేష్, జస్వంత్, మహేష్, నవీన్, వినయ్, ప్రణీత్ పాల్గొన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన ఎంపీ కవిత

సీరోలు, జనవరి 24 : సీరోలు ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు తేజావత్ భోజ్యానాయక్‌ను మహబూబాబాద్ ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కవిత పరామర్శించారు. రూప్లాతండాలోని భోజ్యానాయక్ స్వగృహానికి బుధవారం చేరుకున్నారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికాగా, ఆరోగ్యక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజ్యానాయక్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ముత్యం వెంకన్న ఉన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇస్తే ప్రజాసేవలోకి..'

కురవి, జనవరి 24 : మహబూబాబాద్ లోక్‌సభ సీటును తాను ఆశిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పిస్తే, రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేస్తానని సీఐడీ ఎస్పీ నాగరాజు అన్నారు. శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'ప్రమాదాల నివారణకు చెట్లకు రేడియం'

మహబూబాబాద్ రూరల్, జనవరి24 : రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే రోడ్డుకు ఇరువైపు ఉన్నచెట్లకు రేడియం స్టిక్కర్లను వేస్తున్నట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రం శివారు ఈదుల పూసపల్లి రోడ్డులో బుధవారం రోడ్డుపక్కన ఉన్న భారీ వృక్షానికి రేడియం స్టిక్కర్స్‌ను అతికించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాత్రివేళల్లో రోడ్డుపక్కనే ఉన్న వృక్షాలు కన్పించేందుకు రేడియం స్టిక్కర్లను వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై దీపికరెడ్డి, ఏఎస్సై సూరయ్య, పీసీ బాలరాజు, రెడిన్ ల్యాబ్ యాజమాని లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 24 : ఫార్మసీ రంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ రాంకిషన్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఫార్మసీ కళాశాలలో విద్యార్థినులకు బుధవారం ఫార్మసీరంగ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఇండియన్ ఫార్మ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ (ఐపీజీఏ) జీవితాల సభ్యత్వ సర్టిఫికెట్‌ను అందజేశారు. ప్రిన్సిపాల్ స్వప్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులను ఘనంగా సన్మానించారు.

అటవీశాఖపై విమర్శలు పునఃసమీక్షించుకోవాలి

నెహ్రూసెంటర్, జనవరి 24 : అటవీశాఖ అధికారులపై స్త్రీశిశు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చేసిన విమర్శలను పునఃసమీక్షించుకోవాలని తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సాంబునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు బూర్క సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫారెస్టు ఆఫీసర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఫారెస్టు అధికారులను ఉద్దేశించి సీతక్క చేసిన వ్యాఖ్యలు సరైంది కాదన్నారు. సత్యం, బోడ రమేష్, ఆలం వసంతరాణి, చేరాల విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.